నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శుక్రవారం 3 జనవరి 2025 | MEDAK

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ

మెదక్, జనవరి 2(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గురువారం గజ్వేల్‌లోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ గోపాల్‌రావు, మాజీ సర్పంచ్‌లు యామిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీనునాయక్ ఉన్నారు.

సంగారెడ్డి పట్టణంలో సంగారెడ్డి - నర్సాపూర్ ప్రధాన రహదారిపై కమ్ముకున్న పొగమంచు

అంగన్‌వాడీల భర్తీ ఎప్పుడో..!

- భర్తీకి నోచుకోని టీచర్లు, ఆయా పోస్టులు
- మెదక్ జిల్లాలో 316 పోస్టులు ఖాళీ
- అత్యధికంగా ఆయా పోస్టులు....
- కొన్ని కేంద్రాల బాధ్యతలు ఇన్‌చార్జిలకు..
- అదనపు భారంతో అవస్థలు పడుతున్న టీచర్లు

మెదక్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): మహిళా, శిశు సంరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆయా కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిప్రాంతాల్లో ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. మెదక్ జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారా అని ఎదురుచూస్తున్నారు.

లబ్ధిదారులకు అందని పౌష్టికాహారం...

మెదక్ జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. గ్రామాలు, పట్టణాల్లో ఉండే గర్భిణులు, బాలింతలు, ఐదేండ్లలోపు పిల్లలు రక్తహీనతకు గురికాకుండా, శారీరకంగా బలహీనం కాకుండా ఉండేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతిరోజూ పాలు, ఉడకబెట్టిన కోడిగుడ్డుతో పాటు ఆకుకూరలు, ఇతర కూరలతో పౌష్టికాహారం అందిస్తున్నారు. కేంద్రాల్లో టీచర్లు ఉంటేనే అందరికీ పౌష్టికాహారం సక్రమంగా అందతుంది. అంతేకాదు ఆరోగ్య, ఇతర సర్వేల బాధ్యతలను ఎక్కువగా అంగన్‌వాడీ టీచర్లకే అప్పగిస్తుంటారు. టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యతను పక్క కేంద్రాల టీచర్లకు అప్పగించడంతో వారిపై అదనపు పనిభారం పడుతున్నది. ఆయా పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల్లో టీచర్లే ఆ భారాన్ని మోస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయాలు లేని కేంద్రాల్లో టీచర్లకు సర్వే బాధ్యతలు అప్పగించడంతో కేంద్రాలు మూతబడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని మహిళలు కోరుతున్నారు.

జిల్లాలో నాలుగు ప్రాజెక్టులు...

మెదక్ జిల్లాలో నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో అల్లాదుర్గం, మెదక్, నర్సాపూర్, రామాయంపేట ఉన్నాయి. వీటిలో 0 నుంచి 3 సంవత్సరాలలోపు చిన్నారులు 31,286 మంది, 3 నుంచి 6 ఏండ్లలోపు పిల్లలు 22,299 మంది చొప్పున మొత్తం 53,585 మంది ఉన్నారు. మెదక్ జిల్లాలో 5,293 మంది గర్భిణులు ఉండగా, బాలింతలు 4,651 మంది ఉన్నారు. నాలుగు ప్రాజెక్టుల పరిధిలో 1076 మంది అంగన్‌వాడీ టీచర్లు పనిచేస్తున్నారు. అల్లాదుర్గంలో 230 సెంటర్లు పనిచేస్తుండగా, మెదక్‌లో 278 సెంటర్లు, నర్సాపూర్‌లో 288 కేంద్రాలు, రామాయంపేటలో 280 సెంటర్లు ఉన్నాయి. మొత్తం 1076 కేంద్రాలకు గాను 1,043 మంది టీచర్లు ఉన్నారు. ఇందులో 33 టీచర్ పోస్టులు ఖాళీగా ఉండగా, ఆయాలు 793 మంది ఉండగా, ఆయా పోస్టులు 283 ఖాళీగా ఉన్నాయి. గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలన్న నిబంధన ఉండేది. కానీ, కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులకు విద్యార్హతను పెంచింది. అంగన్‌వాడీ టీచర్‌తో పాటు ఆయాలుగా ఉద్యోగాలకు నియమితులయ్యే వారు కనీసం ఇంటర్ ఉత్తీర్ణత ఉండాలని అని నిబంధన పెట్టింది. వయో పరిమితి 18-25 ఏండ్ల మధ్య ఉండాలి. 65 ఏండ్లు దాటిన తర్వాత వారి సేవలను వినియోగించుకోకూడదు. ఖాళీల్లో 50 శాతం ఆయాలకు ఉద్యోగోన్నతి కల్పించి భర్తీ చేయాల్సి ఉంటుంది.

నోటిఫికేషన్ వచ్చాకే భర్తీ...

జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర కమిషనరేట్ నుంచి నోటిఫికేషన్ రావాల్సి ఉంది. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత పోస్టులను భర్తీ చేస్తాం. ఇప్పటికే జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టుల వివరాలు సేకరించాం. ఆయాలు లేని కేంద్రాల్లో టీచర్లే పనిచేస్తున్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లకు అదనపు బాధ్యతలు అప్పగించాం.

– హైమావతి,
స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి మెదక్

పెరిగిన చలి తీవ్రత

కోహీర్‌లో 8.4 అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

జహీరాబాద్/సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 2: సంగారెడ్డి జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. జహీరాబాద్ నియోజకవర్గంలోని జహీరాబాద్, కోహీర్, న్యాల్‌కల్ మండలాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కోహీర్‌లో 8.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. జహీరాబాద్ మండలం ఆల్గోలో 9.1, మల్చెల్మాలో 9.3, న్యాల్‌కల్‌లో 9.5, సత్వార్, మొగుడంపల్లిలో 10.2, ఝరాసంగంలో10.5, జహీరాబాద్‌లో 10.8, కోహీర్‌లోని దిబ్బలో 11.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చలి తీవ్రతతోపాటు పొగమంచు దట్టంగా కురుస్తుండంతో ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు వహించాలని వైద్యులు సూచిస్తున్నారు. గురువారం ఉదయం 9గంటల వరకు సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని వాహనాలు నడిపారు. వాహనానికి ముందు 10మీటర్ల దూరంలో కూడా ఏముందో కనిపించని పరిస్థితి ఏర్పడింది.

అల్లాదుర్గం-మెటల్‌కుంట ప్రధాన రహదారిపై కమ్ముకున్న పొగమంచు

అవగాహన ఒప్పందం చేసుకుంటున్న కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ

సీబీసీతో గీతం డీమ్డ్ వర్సిటీ ఒప్పందం

పటాన్‌చెరు, జనవరి 2: భారత ప్రభుత్వానికి చెందిన కెపాసిటీ బిల్డింగ్ కమిషన్(సీబీసీ)తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ గురువారం న్యూఢిల్లీలోని సీబీసీ కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వంలోని మానవ వనరుల నిర్వహణ పద్ధతులను మెరుగుపర్చడం, 2.5కోట్ల పౌర సేవలను బలోపేతం చేసే లక్ష్యంతో ఈ నాలెడ్జ్ భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ అవగాహన ఒప్పందంలో కేఎస్ పీపీ తరపున డీన్, పూర్వ రాయభారి సయ్యద్ అక్బరుద్దీన్, డాక్టర్ షరీక్ హసన్ మనజీర్, సీబీసీ ప్రతినిధి బృందంలో మానవ వనరుల విభాగం సభ్యుడు డాక్టర్ ఆర్ బాలసుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి ఎస్‌పీ రాయ్ ఇతర అధికారులు రాహుల్ పోర్వాల్, నికితా సురానా తదితరులు పాల్గొన్నారు.

కాసులాబాద్ పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఐదేండ్లుగా నో సెలవు

ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయుడు కృష్ణమూర్తికి సన్మానం

మిరుదొడ్డి, జనవరి 2: సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలోని కాసులాబాద్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఐదేండ్లుగా ప్రభుత్వం మంజూరు చేసే సెలవులను ఆయన ఒక్కటి కూడా ఉపయోగించుకోకుండా విధులకు హాజరవుతున్నాడు. ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు పాఠశాలకు చేరుకొని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. 2024-25వ విద్యా సంవత్సరానికి NCERT best practies implementationకు మండలం నుంచి ఆయన ఎంపికయ్యాడు. గురువారం ఉపాధ్యాయులు కృష్ణమూర్తిని శాలువాకప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆందోళనకారులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలిస్తున్న పోలీసులు

భూముల చదునుకు యత్నం

పలువురి అరెస్ట్

గుమ్మడిదల, జనవరి 2: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మాపూర్ శివారులో గురువారం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. కస్టోడియన్ భూములను చదును చేస్తున్న పేదలను పోలీసులు అరెస్ట్ చేయగా, పోలీసులతో సీపీఐ నాయకులు వాగ్వాదానికి దిగారు. సీఐ నయీమొద్దీన్,ఎస్సై మహేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో నిరసనకారులను డీసీఎంలో ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో బొంతపల్లి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు నిరుపేదలకు నిరసన చేపట్టారు. పేదలకు కస్టోడియన్ భూములను పంచాలంటూ నినాదాలు చేశారు. 300 మందికిపైగా నిరసనకారులు ఉండడంతో డీసీఎంలలో వివిధ ప్రాంతాల పోలీస్ స్టేషన్లకు వారిని పోలీసులు తరలించారు. ఆందోళనకు కారకులైన సీపీఐ నాయకులు టీఎం ఖాలెక్‌తోపాటు పలువురు నాయకులపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కస్టోడియన్ భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయని తహసీల్దార్ గంగాభవానీ తెలిపారు. గతంలో జిల్లారెవెన్యూ అధికారులు సర్వే చేసి మిగులు భూములను గుర్తించారని, ఆ భూముల జోలికి ఎవరూ పోవద్దని ఆమె హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా రెవెన్యూ అధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ప్రభుత్వ భూమిపై గద్దల కన్ను?

- ప్రభుత్వ భూమి కబ్జాకు రియల్టర్ల విఫలయత్నం
- అనుమతులు లేకుండానే భూమి చదును చేసి మట్టి పోసిన వైనం
- మున్సిపల్ అధికారుల ఆదేశాలు బేఖాతరు
- అధికార పార్టీ నాయకుల అండతోనే రెచ్చిపోతున్నారనే విమర్శలు

హుస్నాబాద్ పట్టణ శివారులో రూ.5 కోట్ల విలువ చేసే భూమికి ఎసరు

హుస్నాబాద్, జనవరి 2:ప్రభుత్వ భూమిపై రియల్టర్ల కన్ను పడింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో విలువైన ప్రభుత్వ భూమికి సంబంధించి తప్పుడు సర్వే నంబరు చూపించి ప్లాట్లు చేసి విక్రయించేందుకు విఫలయత్నం చేస్తున్నారు. కొన్ని రోజులుగా భూమిని కబ్జా చేసేందుకు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆ భూమిని చదును చేసి అందులోని చెట్లను సైతం నరికివేసి మట్టి పోశారు. ఇందులో ఎలాంటి పనులు చేపట్టవద్దని మున్సిపల్ అధికారులు పెట్టిన హెచ్చరిక బోర్డులను సైతం పీకివేసి స్థలాన్ని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటికే ఈ స్థలంలోని భూమిని ప్లాట్ల రూపంలో విక్రయించినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు వారిపై చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. సదరు రియల్టర్లకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయని, వారి ప్రోత్సాహంతోనే సుమారు రూ.5 కోట్లకుపైగా విలువైన భూమిని కబ్జా చేసి విక్రయించేందుకు యత్నిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హుస్నాబాద్ శివారు కరీంనగర్ రోడ్డులోని టీఎస్ మోడల్ స్కూల్ భవనాన్ని ఆనుకొని ఉన్న సుమారు ఐదెకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉంది.

తప్పుడు సర్వే నంబర్‌తో పట్టాలు చేసేందుకు సన్నాహాలు..

హుస్నాబాద్‌లోని టీఎస్ మోడల్ స్కూల్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని తప్పుడు సర్వే నంబరు వేసి ప్లాట్లుగా చేసి విక్రయించేందుకు రియల్టర్లు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరికి పట్టాలు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సర్వేనంబర్ 93లో 24.13ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో టీఎస్ మోడల్ స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మినీస్టేడియం, శ్మశాన వాటిక, గిరిజన బాలికల వసతిగృహం నిర్మించారు. ఇందులో మోడల్ స్కూల్ ప్రహరీని ఆనుకొని కొంత స్థలం ఖాళీగా ఉంది. ఈ సర్వే నంబర్ పక్కనే 62 సర్వే నంబరులో గల పట్టాభూమి ఉంది. ఖాళీ స్థలం 62 సర్వే నంబరు పరిధిలోకి వస్తుందని కొనుగోలుదారులను, అధికారులను నమ్మించి రిజిస్ట్రేషన్లు చేయించేందుకు రియల్టర్లు సన్నాహాలు చేస్తున్నారు. ఖాళీ స్థలంలోని చెట్లను నరికి కాల్చివేసి చదును చేయించారు. టిప్పర్లతో మట్టిని పోస్తుండగా మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. గతంలో చదును చేస్తున్న సమయంలో ఈ స్థలం మున్సిపల్ పరిధిలోకి వస్తుందని, ఇక్కడ ఎలాంటి పనులు చేపట్టవద్దని హెచ్చరిక బోర్డులు పెట్టినప్పటికీ రాతలపై తెల్లరంగు పూసి మరీ కబ్జాకు యత్నిస్తున్నారంటే వీరికి ఎవరి అండ ఉందో తెలుస్తోంది. ఇప్పటికైనా 93సర్వే నంబరులోని 24.13ఎకరాల ప్రభుత్వ భూమిలో మిగులు భూమి సంరక్షణకు అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

హుస్నాబాద్‌లోని టీఎస్ మోడల్ స్కూల్ పక్కన ఖాళీ స్థలంలో టిప్పర్లతో మట్టిని పోసిన రియల్టర్లు, ఖాళీ స్థలంలో చెట్లు నరికిన దృశ్యం

స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, రెవెన్యూ సర్వేయర్ లక్ష్మీనారాయణతో కలిసి గురువారం పరిశీలించారు. స్థలంలో మోడల్ స్కూల్ ప్రహరీకి రాసిన హెచ్చరిక బోర్డును తొలిగించడం, టిప్పర్లతో పోసిన మట్టి కుప్పలు, రియల్టర్లు నరికి వేసిన చెట్లను పరిశీలించారు. 93సర్వేనంబరు హద్దులు, ఇందులో ఉన్న భూమి మొత్తం ఎంత ఉందో వెంటనే సర్వే చేసి చెప్పాలని సర్వేయర్‌ను ఆదేశించారు. తహసీల్దార్‌తో మాట్లాడి 93సర్వే నంబరుతో పాటు 62సర్వేనంబర్లపై వెంటనే సర్వే చేయించాలని కోరారు.

భూమిని స్వాధీనం చేసుకుంటాం

అనుమతులు లేకుండా స్థలాన్ని చదును చేయడం, హెచ్చరిక బోర్డులు తొలిగించడం చట్టరీత్యా నేరం. ఇందుకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. ఈ స్థలం రెవెన్యూ పరిధిలో ఉన్నందున పూర్తిస్థాయిలో సర్వే చేయించిన అనంతరం స్వాధీనం చేసుకొని స్థలానికి ఫెన్సింగ్ వేయిస్తాం. స్థలం సర్వే పూర్తయ్యే వరకు ఈ స్థలంలో ఎలాంటి పనులు చేసినా అడ్డుకోవాలని, పనులు చేసేందుకు యత్నిస్తున్న వారిని గుర్తించాలని మున్సిపల్ అధికారులు, సిబ్బందిని ఆదేశించాం.

– మల్లికార్జున్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ హుస్నాబాద్

మహిళా డిగ్రీ కళాశాల వెనక్కి?

- వృథాగా కవేలి హోటల్ మేనేజ్‌మెంట్ భవనం
- వచ్చే విద్యా సంవత్సరమైనా ప్రారంభమయ్యేనా..?
- కళాశాలలో మిగిలింది ఇద్దరు సిబ్బంది
- పట్టించుకోని అధికారులు

కోహీర్, జనవరి 2: యువతకు శిక్షణ అందించి వారికి ఉపాధి కల్పించేందుకు బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ మహాత్మా జ్యోతిబాపూలే హోటల్ మేనేజ్‌మెంట్ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను కవేలికి మంజూరు చేశారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని కవేలి 65వ జాతీయ రహదారి పక్కన ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో తాత్కాలింగా తరగతులు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శికి ప్రతిపాదనలు పంపించారు. కానీ, పర్యాటక శాఖ నుంచి ఇంతవరకు ఎలాంటి అనుమతులు రాలేదు. దీంతో కవేలి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో తరగతులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఇంటర్ పూర్తి చేసిన బీసీ విద్యార్థినులకు బీఎస్సీ డిగ్రీ కోర్సులో మూడేండ్లపాటు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినా, అధికారుల నిర్లక్ష్యంతో ఆచరణ సాధ్యం కాలేదు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

వృథాగా కళాశాల భవనం...

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని కవేలి జాతీయ రహదారి పక్కన ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల వృథాగా మారింది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ.12కోట్ల వ్యయంతో 5ఎకరాల్లో అద్భుతమైన భవనాన్ని నిర్మించారు. హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను 2017, ఆగస్టు 3న అప్పటిమంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. 2017-18లో బీఎస్సీలో 15మంది శిక్షణ పొందేందుకు కళాశాలలో చేరారు. 2018-19లో 14మంది. 2019-20లో ఏడుగురు విద్యార్థులు జాయిన్ అయ్యారు. మూడేండ్ల బీఎస్సీ కోర్సుతో పాటు 18నెలల క్రాష్ కోర్సును అందించారు. ఇందులో కూడా 25మంది పలు రాష్ట్రాలకు చెందిన యువత శిక్షణ పొందారు. కానీ, కరోనా ప్రభావంతో రెండేండ్ల నుంచి విద్యార్థులు ఎవరూ జాయిన్ కాలేదు. ప్రస్తుతం భవనం ఖాళీగా ఉంది. కళాశాలలో ఇద్దరు సిబ్బంది ఉన్నారు. వారికి కూడా మే నుంచి జీతాలు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. తరగతి గదులు, భవనాన్ని శుభ్రం చేసేందుకు ముగ్గురు కార్మికులు ఉండేవారు. వారు కూడా మానుకున్నారు. కళాశాలలో రెండేండ్లుగా ఎవరూ జాయిన్ కావడం లేదనే విషయం తెలుసుకొన్న గత ప్రభుత్వం బీసీ విద్యార్థినుల శిక్షణ కోసం మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలను ప్రారంభించి తాత్కాలికంగా తరగతులు నిర్వహించేందుకు అనుమతులు కావాలని రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శికి ప్రతిపాదనలు పంపించారు. పర్యాటక శాఖ నుంచి ఇంత వరకు అనుమతులు రాలేదు. అనుమతి లభిస్తే మాత్రం 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి తరగతులు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని విద్యార్థినులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

కవేలి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల

ప్రారంభిస్తే బాగుంటుంది

మహిళా డిగ్రీ కళాశాలను ప్రారంభించి హోటల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ ఇస్తేనే బాగుంటుంది. లేకపోతే భవనం కూడా వృథాగా అవుతుంది. ఇంత పెద్ద భవనం ఖాళీగా ఉంటే ఏం లాభం. ఎవరికైనా ఉపయోగపడాలి కదా. మాకు కూడా మే నుంచి జీతాలు రావడం లేదు.

– చంద్రయ్య, కవేలి హోటల్‌మేనేజ్‌మెంట్ కళాశాల, సిబ్బంది

భవనం వృథా కావొద్దు

హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల్లో విద్యార్థులు అన్ని రకాలుగా శిక్షణ పొందడానికి భవనం సిద్ధంగా ఉంది. 60మందికి సరిపడే విధంగా హాస్టల్ భవనం ఉంది. తాగునీరు, కరెంటు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయి. ఇంత పెద్ద భవనం వృథా కాకుండా చూడాలి. విద్యార్థులకు కూడా భవిష్యత్తు బాగుంటుంది. మాకు కూడా జీతాలు చెల్లించి, మా సమస్యలు పరిష్కరించాలి.

– అమర్నాథ్, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల సిబ్బంది

తలపై స్కానర్‌తో బసవన్న

హైటెక్ బసవన్న

పటాన్‌చెరు, జనవరి 2: ఫోన్ పేలో పైసలిచ్చిన సార్‌కు సలాం కొట్టు...జీ పేలో డబ్బులిచ్చిన దొరకు దండంపెట్టు బసవన్న అంటున్నారు గంగిరెద్దుల వాళ్లు. సంక్రాంతి పండుగకు గంగిరెద్దులాడించేవారు ఇండ్ల ఎదుట ప్రత్యక్షమై గంగిరెద్దులతో ఆటలాడిస్తూ వినోదం పంచుతుంటారు. ఈ సంప్రదాయం గుర్తున్నవారు నగదు, బియ్యం, ధాన్యం వారికిచ్చి గౌరవిస్తారు. ఇప్పుడు కంప్యూటర్ కాలం, నగదు జేబుల్లో ఉండడం లేదు. ఏ ఇంటికి వెళ్లినా నగదు ఇవ్వడం తగ్గింది. ఈ నేపథ్యంలో నిరక్షరాస్యులైన గంగిరెద్దుల వాళ్లు సైతం కాలానుగుణంగా మారుతున్నారు. భిక్షాటన సమయంలో డబ్బులు స్వీకరించేందుకు గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా డబ్బులు తీసుకునేందుకు స్కానర్‌ను వాడుతున్నారు. ఆ స్కానర్‌ను ప్రజలు స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్‌చేసి తోచినంత డబ్బులు వేస్తున్నారు. నగదు సేకరణకు బసవన్నకు స్కానర్ పేపర్ పెట్టిన దృశ్యం గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగిలో కనిపించింది.